క్లుప్తంగా

మహిళాభివృద్ధే లక్ష్యం..



మాట్లాడుతున్న కమిషనర్ శేషాంజన్ స్వామి

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి అన్నారు. శుక్రవారం మహిళా శక్తి పథకంలో భాగంగా బ్యూటీపార్లర్‌ను ప్రారంభించారు. తొలుత మెప్మా ఆర్పీలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. డ్వాక్రా, వీధి వ్యాపారుల రుణాలు, చెల్లింపులపై చర్చించారు.

హరిత దీక్ష చేపట్టిన చిన్నారులు



దీక్షను తీసుకుంటున్న చిన్నారులు

చుంచుపల్లి: నవభారత్ స్కూల్ విద్యార్థినులు నాగసత్య ప్రియ, భవ్యశ్రీలు ప్రకృతి ప్రేమికుడు కేఎస్. రాజశేఖర్ సమక్షంలో శుక్రవారం ప్రకృతి హరిత దీక్షను చేపట్టారు. ఈ సంవత్సరంలో 100 మొక్కలు నాటాలని దీక్షలో భాగంగా లక్ష్యాన్ని కేటాయించారు. మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ అభినందించిన ప్రకృతి ప్రేమికుడు రాజశేఖర్, చిన్న వయస్సు నుంచే చిన్నారులకు ప్రకృతిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోటి ఇలాంటి దీక్షలను ప్రోత్సహిస్తున్నారు. ఈ దీక్ష తీసుకున్న చిన్నారులు మేము సైతం ప్రకృతిని కాపాడటానికి మొక్కలు నాటుతామని ముందుకొస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమ్మ పేరు మీద ఒక మొక్కని నాటాలని పిలుపునిచ్చారని, ప్రతీఒక్కరు మొక్క నాటాలని రాజశేఖర్ అన్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

సింగరేణి(కొత్తగూడెం): గత ప్రభుత్వంలో ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని, స్థలం ఇచ్చిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కూలీలైన్‌లో జరిగిన శాఖ మహాసభలో మాట్లాడారు. గత ప్రభుత్వం చేపట్టిన ఇళ్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను కోరారు. ఈ మేరకు ఇల్లెందు-కొత్తగూడెం నేషనల్ హైవే 930పీ రోడ్డుపై తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో శుక్రవారం రోడ్లు భవనాల శాఖ, పోలీసు అధికారులతో కలిసి టేకులపల్లి మండలం రోళ్లపాడు క్రాస్‌రోడ్డు, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు, లాలుతండా, ఇతర అప్రోచ్ రోడ్లను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక, స్పీడ్ లిమిట్ బోర్డులు, రోడ్ సైడ్ షోల్డర్ లెవెలింగ్, రేడియం స్టడ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ నాగేశ్వర్‌రావు, ఏఈ మోతీలాల్, టేకులపల్లి సీఐ టి.సురేష్, ఎస్‌ఐ పి.సురేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించండి..



కవితానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పండుగలోపు కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడుని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జీఎం చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతీనెల 15వ తేదీన వేతనాలు చెల్లిస్తున్నారు. దసరా పండుగ నేపథ్యంలో వారంరోజులు ముందుగా జీతాలు అందించాలని కోరారు. సీఎండీ ప్రతీనెల 7వ తేదీన కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ఆదేశించినా.. సంబంధిత అధికారులు స్పందించటం లేదన్నారు.

సంక్షేమ పథకాలన్నీ ఒకే కార్డుతో..



సింగభూపాలెం చెరువులో చేపపిల్లలను వదులుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు

పాల్వంచ: ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని బొల్లేరుగూడెం 10వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ సర్వేను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... సంక్షేమ పథకాల అమలును సులభతరం చేసేందుకు డిజిటల్ కార్డు దోహదపడుతుందన్నారు. ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు ఉద్యోగ, ఉపాధి రీత్యా ఇంటి వద్ద లేని వారి కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఒక రాష్ట్రం ఒక కార్డు అనే ఆలోచనతో చేపట్టిన ఈ కార్డును సద్వినియోగం చేసుకోవాలని రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వివరాలు 30 శాఖలు, 30 రకాలగా సమాచారం సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, అలా కాకుండా అర్హులైన వారందరూ ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ కార్డు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు, తహసీల్దార్లు వివేక్, పుల్లయ్య, ఎస్ఐ సుమన్, నాయకులు ఎస్‌కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం పాల్గొన్నారు.

సింగభూపాలెం చెరువు అభివృద్ధికి రూ. 8.50 కోట్లు మంజూరు

సుజాతనగర్: సింగభూపాలెం చెరువు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలను శుక్రవారం సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో ఎమ్మెల్యే వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరువు సుందరీకరణకు రూ.8.50 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కాకతీయుల కాలం నాటి సింగభూపాలెం చెరువుపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవనోపాధి పొందుతున్నట్లు చెప్పారు. సుజాతనగర్ మండలం సుజాతనగర్, నాయకులగూడెం, కోమటిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, లక్ష్మీదేవీపల్లి గ్రామ పంచాయతీలను కలిపి కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): శుక్రవారం కొత్తగూడెం మున్సిపాలిటీ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి పరిధిలోని 66 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.66.07 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అదేవిధంగా విధి నిర్వహణలో విద్యుత్ ప్రమాదానికి గురైన మున్సిపల్ కార్మికుడు దుర్గప్రసాద్‌కు, అవగాహన లోపంతో దోమలమందు తాగి మృతి చెందిన బత్తుల ఓదెమ్మ కుటుంబానికి మున్సిపల్ శాఖ నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసింది. వీరికి ఒక్కో కుటుంబానికి కుటుంటానికి రూ.3 లక్షల చొప్పున ఎమ్మెల్యే అందజేశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

పాల్వంచ: సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కూనంనేని హాజరై మాట్లాడారు. విద్యార్థులు భావి భారత పునాదిరాళ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడం పట్ల అభినందించారు. కళాశాల చైర్మన్ భరత్ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకన్న, ఎస్‌కె.సాబీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి..



మాట్లాడుతున్న డీపీఓ చంద్రమౌళి

జూలూరుపాడు: తాగునీటి సహాయకులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ చంద్రమౌళి అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామ తాగునీటి సహాయకుల శిక్షణ తరగతులకు శుక్రవారం డీపీఓ చంద్ర మౌళి హాజరై మాట్లాడారు. ఇక్కడ నేర్చుకున్న పరిజ్ఞానంతో గ్రామాల్లో తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలను అధిగమించవచ్చన్నారు. తాగునీటి సహాయకులు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవడం వల్ల ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన తాగునీటి సరఫరా చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయడంలో తాగునీటి సహాయకులే కీలకమనే విషయాన్ని మరవరాదన్నారు. రెండోరోజు శిక్షణ తరగతుల్లో తాగునీటి సహాయకులకు చేతి పంపుల నిర్వహణ, మరమ్మతులపై టీఓటీలు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమణరావు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరామ్, మిషన్ భగీరథ (ఇంట్రా విలేజ్) డీఈ ఎం.శివయ్య, టీఓటీలు రామకృష్ణ, నజీర్, తాగునీటి సహాయకులు పాల్గొన్నారు.

చదువుతో పేదరికాన్ని అధిగమించవచ్చు



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: విద్యార్థులు పేదరికాన్ని అధిగమించాలంటే బాగా చదువుకోవడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధి బస్వతారకకాలనీ పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూలమాలలు సమర్పించారు. విద్యార్థులతో కలిసి అధ్యాపకులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఇంటర్ నోడల్ ఆఫీసర్ మాట్లాడారు. విద్యార్థులు నిరంతరం చదువుపై ధ్యాస పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సులోచనరాణి, ఎస్.శేషుబాబు, ఖుర్షిద్ అహ్మద్, శంకర్ పాల్గొన్నారు.

ఏరియా లెవల్ క్రీడాపోటీలు



కబడ్డీ పోటీలకు హాజరైన క్రీడాకారులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ డబ్ల్యూపీఎస్ జీఏ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియా లెవల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం కార్పొరేట్ వెల్ఫేర్ డీజీఎం గడిపెల్లి రాజేంద్రప్రసాద్ కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ప్రారంభించారు. కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విజేతలు కోలిండియా లెవల్‌లో రాణించాలని, సింగరేణి కీర్తిని ఇనుమడింపజేయాలని కోరారు. ఈ పోటీలలో ఈనెల 22, 23 తేదీలలో ఆర్జీ–1 ఏరియాలో జరిగే కంపెనీ లెవల్ పోటీలకు ఎంపిక చేయటం జరిగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వీ రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం ప్రెసిడెంట్ ఎస్.పీతాంబరం, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ ఎంసీ పాసినెట్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ముందుకెళ్దాం..



మాట్లాడుతున్న రాంబాబు, ముసలయ్య

జూలూరుపాడు: రజకులు ఐకమత్యంగా ముందుకెళ్లాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు, జిల్లా కార్యదర్శి చిటికెన ముసలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం భేతాళపాడు గ్రామంలో జరిగిన రజక వృత్తిదారుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా రజకులు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో వెనకబడి ఉన్నారన్నారు. 50 సంవత్సరాలు నిండిన రజకులకు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకులను కులం పేరుతో దూషించకుండా, దౌర్జన్యాలు, దాడులు జరగకుండా ప్రభుత్వం జీఓ తీసుకరావాలన్నారు. అంతకముందు చాకలి ఐలమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళ్లూరి పుల్లయ్య, నిమ్మటూరి నాగేశ్వరరావు, రేగిమూడి సీతయ్య, నిమ్మటూరి సతీష్, రేగిమూడి రమేష్, సిరికొండ నరసింహారావు, ఎం.రమేష్, రామారావు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఏకగ్రీవం

సింగరేణి(కొత్తగూడెం): జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక స్థానిక కొత్తగూడెంలోని కార్యాలయంలో శుక్రవారం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.మోహన్‌రావు, కోశాధికారిగా అల్లాడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.సాయిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో మూఢనమ్మకాలను పారదోలేందుకు, జనాలను విజ్ఞానం వైపు నడిపించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో మండల కమిటీలను ఏర్పాటు చేసుకొని నిధుల సమీకరణకు కార్యాచరణ చేపడతామన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బర్ల తిరుపతిరావుకు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు రెండో రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ పరీక్షకు 109 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 25 మంది గైర్హజరయ్యారు. పదో తరగతి పరీక్షకు 116 మంది హాజరు కావాల్సి ఉండగా, 100 మంది హాజరయ్యారు. దీంతో పాటు మధ్యాహ్నం పదో తరగతి పరీక్షకు 70 మంది హాజరు కావాల్సి ఉండగా, 55 మంది హాజరై 15 మంది గైర్హాజరయ్యారు.

తప్పిపోయిన బాలిక.. తల్లిదండ్రులకు అప్పగింత

పాల్వంచ: వీధిలో ఆడుకుంటూ ఓ బాలిక తప్పిపోయి బస్టాండ్ వరకు వచ్చింది. పోలీసుల కథనం... శుక్రవారం చాకలి బజార్‌కు చెందిన ఎనిమిది సంవత్సరాల కావ్య తప్పిపోయి నడుచుకుంటూ బస్టాండ్‌కు వచ్చింది. ఓ షాపులో ఉండే వ్యక్తి బాలికను గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీంతో బాలిక తెలిపిన వివరాల మేరకు తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి

పాల్వంచరూరల్: బతుకమ్మ సంబరాలు జరుపుకునే మహిళలు నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని రూరల్ ఎస్ఐ బి.సురేష్ సూచించారు. దసరా సెలవులు రావడంతో మహిళలు తమ పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. బతుకమ్మల వెంట పిల్లలను తీసుకుని వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దసరా ఉత్సవాలు నిర్వహించే కమిటీలు గోదావరి వద్ద నిర్దేశించిన ఘాట్ల వద్దనే నిమజ్జనం చేసుకోవాలని పేర్కొన్నారు.

వన్యప్రాణులను రక్షించుకుందాం..



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

పాల్వంచరూరల్: వన్యప్రాణులతోపాటు, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బి.బాబు అన్నారు. ప్రపంచ ఎనిమల్ డే సందర్భంగా శుక్రవారం వైల్డ్‌లైఫ్, ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పట్టణంలో నిర్వహించిన ర్యాలీని వైల్డ్‌లైఫ్ డివిజన్ కార్యాలయంలో ఎఫ్‌డీఓ పచ్చజెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎఫ్‌డీఓ మాట్లాడుతూ.. వన్యప్రాణులను, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత కేవలం అటవీశాఖ అధికారులది మాత్రమే కాదని.. వాటి సంరక్షణ ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. అడవులు పెరిగితే పర్యావరణానికి రక్షణగా ఉంటుందని తద్వారా, జంతువులు స్వేచ్ఛగా పెరుగుతాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ రేంజర్లు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించండి..



మాట్లాడుతున్న వేణుగోపాలచారి

ఇల్లెందురూరల్: వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణం స్పందిస్తూ మెరుగైన సేవలందించాలని ట్రాన్స్‌కో వరంగల్ రీజియన్ సీజీఆర్‌ఎఫ్ వేణుగోపాలచారి సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నిరంతరం విద్యుత్ సరఫరాలో ఏదో ఒక కారణంతో అంతరాయం ఏర్పడుతోందని, అటువంటి సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రక్షణ చర్యలు తీసుకుంటూ వేగవంతంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని చెప్పారు. ఎంత పనిఒత్తిడిలో ఉన్నా వినియోగదారులతో దురుసుగా వ్యవహరించడం, అమర్యాదగా మాట్లాడటం వంటివి చేయొద్దన్నారు. అనంతరం పలువురు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ టెక్నికల్ సభ్యుడు రమేష్, ఫైనాన్స్ సభ్యుడు చరణ్‌దాస్, ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈలు రాము, రవి, లైన్ ఇన్‌స్పెక్టర్ చలమయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

పాల్వంచ: పాల్వంచకు మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని వివిధ పార్టీల నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక వర్తక సంఘ భవనంలో పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికలు లేని కారణంగా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సరైన పారదర్శకత లోపించిందన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నట్లు చెప్పారు. కొత్తగూడెం, పాల్వంచ కార్పొరేషన్ చేయడం వల్ల ఏజెన్సీ చట్టాలు ఉల్లంఘన అవుతాయన్నారు.

సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకుడు రమేష్ రాథోడ్, సీపీఎం, ప్రజాపంథా, బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ నాయకులు కొండపల్లి శ్రీధర్, నిమ్మల రాంబాబు, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, వానపాకుల రాంబాబు, సింధుతపస్వీ, భట్టు మురళీ, రమణమూర్తి నాయుడు, కత్తి శ్రీను, ఆరుద్ర సత్యనారాయణ, రంగారావు, వీరన్న, కాపర్తి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పక్కదారి పట్టిస్తున్న పాలకులు



మాట్లాడుతున్న రమేష్‌నాయక్

ఇల్లెందురూరల్: పాలకులు అనవసర విషయాలపై చర్చలకు తెరలేపి ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని సేవాలాల్ సేన మండలశాఖ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ ఆరోపించారు. మండలంలోని పోలారం గ్రామంలో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. వానాకాలం సీజన్ పూర్తి కావస్తున్నా నేటికీ రైతు భరోసా అమలు చేయలేదని, రుణమాఫీ కూడా చాలామంది రైతులకు వర్తించలేదని వాపోయారు. ఈ దసరా పండుగ నుంచైనా మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలని కోరారు. యాసంగి సీజన్ ప్రారంభం నాటికి రైతు భరోసా రెండు పంటలకు కలిపి రూ.15వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా విషయాలను పక్కన పెట్టి ప్రజలకు ఉపయోగం లేని విషయాలను చర్చకు పెట్టి ప్రజలను గందరగోళానికి గురిచేయడం మానుకోవాలని కోరారు. సమావేశంలో జర్పుల రాంచంద్రనాయక్, మంగీలాల్‌నాయక్, బోడ రమేష్, భద్రునాయక్, ఆజ్మీర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ – దర్గా.. మధ్యలో బెల్టుషాపులు

ఇల్లెందు: సిండికేట్ అయిన నాటి నుంచి వరుసగా గల్లీగల్లీకో బెల్టుషాపులు వెలుస్తున్నాయి. కళ్లు మూసి తెరిచే లోపు అక్కడ బెల్టుషాపులు ఏర్పాటయ్యాయి. పట్టణంలోని మిషన్ స్కూల్ – తాజుద్దీన్ బాబా దర్గా, ఎస్సీ హాస్టల్, చర్చిల సమీపంలో బెల్టుషాపులు వెలిశాయి. ఒకటి వెలిసిన మరుసటి రోజే మరొకటి. ప్రభుత్వ నిబంధన ప్రకారం కనీసం 100 మీటర్ల దూరం ఉండాలని సూచిస్తున్నా.. ఆయా యజమానులు పట్టించుకోకపోవడాన్ని ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై రెండు రోజుల క్రితం షేక్ షఫియా మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బెల్టుషాపుల వల్ల ప్రార్థనలు చేసుకోలేకపోతున్నామని, తొలగించాలని వినతిపత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



టేకులపల్లిలో గాయత్రీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారు

ఇల్లెందు: దేవీశరన్నవరాత్రి వేడుకల సందర్భంగా పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీమాతకు రెండోరోజు శ్రీ మహాగౌరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో భక్తులు శుక్రవారం దుర్గామాతకు విశేష పూజలు చేశారు. గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు కుంకుమ పూజ చేసి, నైవైద్యం సమర్పించారు. పలువురు మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా చీరలతో అలంకరించారు.

టేకులపల్లి: దేవీ శరన్నవరాత్రి వేడుకలు రెండో రోజు శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. టేకులపల్లిలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అమ్మవారికి పూజలు చేశారు.

అన్న ప్రసాద వితరణ...

మద్రాస్‌తండా పంచాయతీ కొండంగులబోడు గ్రామానికి చెందిన ముగ్గురు స్వాములు, నలుగురు మాతలు మొత్తం ఏడుగురు దుర్గామాత మాలధారులకు శుక్రవారం కొండంగులబోడు వీరభద్ర స్వామి ఆలయంలో భూక్య రవి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాళోతు సురేందర్‌నాయక్, ఆలయ పూజారి కేళోతు శంకర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ గాయత్రిదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర ఆలయం, కోటమైసమ్మతల్లి ఆలయం, జూలూరుపాడు శ్రీసీతారామాలయంలోని ప్రత్యేక మండపాల్లో శ్రీదేవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.



ఇల్లెందు: ఇందిరానగర్‌లో ...



జూలూరుపాడు: వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీలో



ఇల్లెందురూరల్: గాయత్రీదేవిగా అమ్మవారు